ఒత్తిడిని అధిగమిస్తే లక్ష్యం సాధ్యం


విద్యార్థులతో మాట్లాడుతున్న డాక్టర్ శృతి

ముషీరాబాద్: విద్యార్థులు ఒత్తిడికి అధిగమిస్తే లక్ష్యం సాధ్యమవుతోందని ఒత్తిడికి గురి కాకుండా ప్రశాంత వాతావరణంలో చదువుకోవాలని అప్పుడే మంచి ఫలితాలు సాధిస్తారని డిస్టిక్ మెంటల్ హెల్త్ ప్రోగ్రాం ఆఫీసర్ (డీఎంహెచ్‌పీ) డాక్టర్ శృతి సూచించారు. సోమవారం ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులు మానసిక ఒత్తిడికి లోను కాకుండా ఉండేందుకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో ఆందోళన చెందకుండా క్రమశిక్షణతో చదువుకోవాలని సూచించారు. మంచి ఆహారం, సమయపాలన పాటించాలన్నారు. హైదరాబాద్ జిల్లాలో 185 పాఠశాలల విద్యార్థులకు ప్రత్యేక తరగతులు తీసుకుంటూ మానసిక ఒత్తిడికి లోను కాకుండా అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ముషీరాబాద్ విద్యామండలి డిప్యూటీ ఐఓఎస్ స్వరూపారాణి, ప్రధానోపాధ్యాయులు నరేందర్‌యాదవ్ పాల్గొన్నారు.

ప్రపంచస్థాయి సదస్సుకు యాక్షన్ ఎయిడ్ ప్రతినిధులు


సదస్సుకు బయలుదేరిన సభ్యులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: నేపాల్ రాజధాని కాట్మండో నగరంలో ఈ నెల 15–19 వరకు జరగనున్న ప్రపంచ స్థాయి సోషల్ ఫోరం సదస్సులో తెలంగాణ రాష్ట్రం నుంచి యాక్షన్ ఎయిడ్ సంస్థ ప్రతినిధులు చెవ్వ రఘుపతిరావు, శివలింగం, తిరుపతి పాల్గొంటున్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి పాల్గొంటున్న ఈ సదస్సుకు తెలంగాణ నుంచి ముగ్గురు ప్రతినిధులు ఎంపికయ్యారు. వారు మాట్లాడుతూ.. మానవ హక్కుల పరిరక్షణ, దళిత, మహిళ హక్కులు, లిబరైజేషన్ తదితర అంశాలపై ఈ సదస్సులో చర్చిస్తారన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి


మాట్లాడుతున్న పిల్లి శ్రీనివాస్ రావు

కాచిగూడ: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు మహాసభ అధ్యక్షుడు పిల్లి శ్రీనివాస్ రావు పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు మహాసభ మహిళా కమిటీ అధ్యక్షురాలు చామకూర సుజాత అధ్యక్షతన సోమవారం కాచిగూడ మ్యాడం అంజయ్య హాల్‌లో మహిళా ప్రతినిధుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పిల్లలకు మన సంస్కృతి, సంప్రదాయాలను చిన్నతనం నుంచే నేర్పించాలని సూచించారు.ఫిబ్రవరి 14న వాలంటైన్స్ డేను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని, అది మన సంస్కృతి కాదన్నారు. ప్రభుత్వం ప్రకటించిన కులగణనలో మున్నూరు కాపులందరూ కులగణన పత్రంలో మున్నూరుకాపు అని మాత్రమే రాయాలని సూచించారు. మహిళా దినోత్సవం మార్చి 8న శివరాత్రి పండుగ ఉన్నందున మార్చి 10న నిర్వహించనున్నట్లు మహిళా అధ్యక్షురాలు చామకూర సుజాత తెలిపారు. ఈ కార్యక్రమంలో నగేష్, అన్నపూర్ణ, అన్నం శాంతి ప్రియ, జయశ్రీ, అనూష, గానవి గోదాసి, రాకేష్ పాల్గొన్నారు.

జీవితంలో ఎత్తుపల్లాలు చూసిన వారే

ఉన్నతంగా రాణిస్తారు


కేవీ రమణాచారి దంపతులను సత్కరిస్తున్న ప్రముఖులు

చిక్కడపల్లి: జీవిత ప్రయాణంలో ఎత్తుపల్లాలు చూసిన వ్యక్తులు ఉన్నతంగా రాణిస్తారని రాష్ట్ర హైకోర్టు పూర్వ న్యాయమూర్తి జస్టిస్ శేషశయనారెడ్డి పేర్కొన్నారు. త్యాగరాయ గానసభలో సోమవారం రాత్రి నిర్వహించిన జీవీఆర్ ఆరాధన కల్చరల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర ప్రభుత్వం మాజీ సలహాదారు డాక్టర్ కేవీ రమణాచారి జన్మదిన వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా శేషశయనారెడ్డి హాస్యానందం పత్రిక నిర్వహణలో జరిగిన కార్టూన్ పోటీలలో ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులను ప్రదానం చేశారు. అనంతరం రమణాచారి దంపతులను ఘనంగా సన్మానించారు. ప్రముఖులు డాక్టర్ ఎం.కె.రాము, రాజశేఖర్‌రెడ్డి, సుబ్బారావు, లంకా లక్ష్మీనారాయణ, కృష్ణమాచార్యులు, లక్కారాజు నిర్మల, వెంకటరెడ్డి, కిరణ్మయి పాల్గొన్నారు.

నియామకం


శ్యామ్‌కురుమకు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

కవాడిగూడ: బీసీ యువజన సంఘం జాతీయ అధ్యక్షుడిగా కనకాల శ్యామ్‌కురుమను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ ప్రకటించారు. సోమవారం కనకాల శ్యామ్‌కురుమకు నియామక పత్రంతో పాటు పుష్ప గుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో బీసీల ఉద్యమంలో అత్యంత క్రియాశీలకంగా పనిచేస్తూ బీసీ విద్యార్థి, యువజనుల సమస్యలపై గత 15 సంవత్సరాలుగా పనిచేస్తున్న శ్యామ్‌కురుమను గుర్తించి ఏకగ్రీవంగా జాతీయ అధ్యక్షుడిగా నియమించినట్లు తెలిపారు. శ్యామ్‌కురుమ మాట్లాడుతూ.. జాతీయ స్థాయిలో బీసీ ఉద్యమాన్ని బలోపేతం చేయడంలో భాగంగా త్వరలోనే దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాలలో పర్యటించి బీసీ యువజన సంఘం నిర్మాణాన్ని పటిష్టం చేస్తూ ఉద్యమాన్ని దేశ వ్యాప్తంగా విస్తరింపచేయడానికి కృషిచేస్తానన్నారు. గణేష్‌చారి, తాటికొండ విక్రమ్‌గౌడ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

స్వామి వివేకానంద ఐకాన్ అవార్డుల ప్రదానోత్సవం



చిక్కడపల్లి: గోల్డెన్ స్టార్ యూత్ కల్చరల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి స్వామి వివేకానంద ఐకాన్ అవార్డుల ప్రదానోత్సవం త్యాగరాయగానసభలో జరిగింది. కేంద్ర మాజీ మంత్రి ఎస్.వేణుగోపాలచారి ముఖ్యఅతిథిగా పాల్గొని ఎంపిక చేసిన పలువురు ప్రముఖులకు అవార్డులను ప్రదానం చేసి సన్మానించారు. ఈ సందర్భంగా వర్ధమాన నృత్యకళాకారులు సంప్రదాయ నృత్యాలను ప్రదర్శించి ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు బింగి నరేందర్‌గౌడ్, రాజశ్వేరి శ్రీధర్, కృష్ణప్రియ, దాసరి అమూల్యారెడ్డి, శ్రీనివాస్, నర్సింహారెడ్డి, శ్రీహరి, అంబదాస్ తదితరులు పాల్గొన్నారు.

‘గృహజ్యోతి’ దరఖాస్తుల స్వీకరణ


దరఖాస్తులను స్వీకరిస్తున్న అధికారులు

ముషీరాబాద్: ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహజ్యోతి పథకాన్ని అర్హులైన ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ముషీరాబాద్ విద్యుత్ శాఖ ఏఈ శాంతారం సూచించారు. సోమవారం ముషీరాబాద్‌లో ప్రజాపాలనలో గృహజ్యోతి పథకానికి దరఖాస్తు చేసుకోని వారి నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా శాంతారాం మాట్లాడుతూ.. 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను అర్హులైన ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రాంతాల వారీగా కౌంటర్లు ఏర్పాటు చేస్తూ దరఖాస్తులను స్వీకరిస్తున్నామన్నారు.

నెహ్రూనగర్ జీహెచ్‌ఎంసీ వార్డు కార్యాలయంలో..

కాచిగూడ: ప్రభుత్వం ప్రకటించిన గృహజ్యోతి పథకం కోసం 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అమల్లో భాగంగా గృహజ్యోతి పథకానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కాచిగూడ సెక్షన్ ఏఈ బూర్గు అంజన్ తెలిపారు. నెహ్రూనగర్ జీహెచ్‌ఎంసీ వార్డు కార్యాలయం, మౌలానా ఆజాద్‌నగర్, నింబోలిఅడ్డ, మోతీలాల్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సిబ్బంది దరఖాస్తులను స్వీకరిస్తారని రేషన్, ఆధార్ కార్డు, విద్యుత్ బిల్లుల జిరాక్స్ కాపీలను అందజేయాలన్నారు. అద్దెకు ఉన్నవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు.

విద్యార్థి దశ నుంచే సేవాగుణం అలవర్చుకోవాలి


విద్యార్థులకు స్టేషనరీ అందజేస్తున్న రచనశ్రీ, ఎస్సై చందన

కవాడిగూడ: విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ సేవా గుణం అలవర్చుకోవాలని కవాడిగూడ కార్పొరేటర్ రచనశ్రీ అన్నారు. అప్నా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మా ఆప్‌కీ చాయా స్వచ్ఛంద సంస్థ సహకారంతో సోమవారం కవాడిగూడ డివిజన్ గగన్‌మహల్‌లోని భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ పాఠశాలలో 85 మంది విద్యార్థులకు స్టేషనరీ, సేఫ్టీ న్యాప్‌కిన్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కవాడిగూడ కార్పొరేటర్ జి. రచనశ్రీ, సెంట్రల్‌జోన్ మహిళా పోలీస్‌స్టేషన్ ఎస్సై చందన హాజరై మాట్లాడారు. విద్యార్థి దశ నుంచే చిన్నారులు సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలని సూచించారు. స్వచ్ఛంద సేవా సంస్థలు చేస్తున్న సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో వరలక్ష్మి, ధీరజ్‌కుమార్, రమేష్, శ్రావణి, లావణ్య, మౌనిక, మీన, ప్రధానోపాధ్యాయులు మాధవి, బీజేపీ నాయకులు వెంకటేష్ పాల్గొన్నారు.

నేడు ప్రైవేటు ఉపాధ్యాయులకు వర్క్ షాపు


సాధుల మధుసూదన్

అంబర్‌పేట్: తెలంగాణ ప్రభుత్వం గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల సంఘం(ట్రస్మా) ఆధ్వర్యంలో నేడు ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులకు ఉత్తమ బోధన అంశాలపై వర్క్ షాపు నిర్వహించనున్నట్లు అధ్యక్షుడు సాధుల మధుసూధన్ తెలిపారు. పటాన్ చెరులోని ఎల్లంకి ఇంజనీరింగ్ కళాశాలలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ వర్క్ షాపు ఉంటుందని నాణ్యమైన బోధన పద్ధతులపై నిపుణులచే శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు 9347337244 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

అమాయకుల ఇళ్లు కూల్చడం దారుణం


ధర్నాలో పాల్గొన్న బీజేపీ నేతలు

చిక్కడపల్లి: ఇళ్లను కోల్పోయి నిస్సహాయస్థితిలో నిరసన చేస్తున్న గాంధీనగర్ డివిజన్ స్వామి వివేకానందనగర్ బస్తీవాసులకు బీజేపీ ఓబీసీ మోర్చా కన్వీనర్ ఎం.ఉమేష్ ఆధ్వర్యంలో పార్టీ నేతలు సంఘీభావం తెలుపుతూ ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన పూస రాజు మాట్లాడుతూ.. అమాయకమైన దళిత కుటుంబాలకు న్యాయం చేస్తామని నమ్మించి మోసపూరిత చర్యలతో బస్తీ మహిళలతో సంతకాలు సేకరించిన ముషీరాబాద్ తహసీల్దార్ కోర్టును తప్పుదోవ పట్టించి ఇళ్లను కూల్చారని మండిపడ్డారు. 15 రోజులుగా నిరసన దీక్ష చేస్తున్న కూడా బస్తీ వాసులకు పట్టించుకోని ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్య ధోరణిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. పేదలకు న్యాయం జరిగేవరకు అండగా బీజేపీ పార్టీ నిలుస్తుందని తెలిపారు. ఈ ధర్నాలో సదానంద్ ముదిరాజ్, రమేశ్‌రామ్, వినయ్‌కుమార్, ఎం.నవీన్‌గౌడ్, మద్దూరి శివాజీ, ఆనంద్‌రాజాగౌడ్, కనకేష్, పీఎస్ చారి, నర్సింగ్‌రావు, రత్నసాయిచంద్, శ్రీకాంత్, అరుణ్‌కుమార్, దోనేటి సత్యం సత్తిరెడ్డి పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత


చెక్కు అందజేస్తున్న కిషన్‌రెడ్డి

కాచిగూడ: ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి సూచించారు. బర్కత్‌పుర, భూమన్నలేన్ ప్రాంతానికి చెందిన గోపాల్ ఇటీవల అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్నారు. ఖర్చుల నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకోగా రూ.1.20 లక్షలు మంజూరయ్యాయి. సోమవారం స్థానిక కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్‌తో కలిసి కిషన్‌రెడ్డి గోపాల్‌కు చెక్కు అందజేశారు.

కేన్సర్‌పై అవగాహన పెంచుకోవాలి


శిబిరాన్ని ప్రారంభిస్తున్న నాగభూషణం, మురళీధరుడు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: కేన్సర్‌పై ప్రతి ఒక్కరు అవగాహన పెంచుకుని తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని వాకర్స్ ఇంటర్నేషనల్ పూర్వ అధ్యక్షులు వి.నాగభూషణం, మాత వాకర్స్ క్లబ్ నల్లకుంట అధ్యక్షులు డాక్టర్ వై.మురళీధరుడు అన్నారు. సోమవారం మాతా వాకర్స్ క్లబ్ నల్లకుంట, విజయలక్ష్మి చారిటబుల్ ట్రస్ట్, లయన్స్ క్లబ్ హైదరాబాద్, పద్మకాలనీ హౌజింగ్ సొసైటీ ఆధ్వర్యంలో పద్మకాలనీ కమ్యూనిటీహాల్లో కేన్సర్‌పై అవగాహన శిబిరాన్ని నిర్వహించారు. ఎంఎన్‌జే కేన్సర్ ఆసుపత్రి సౌజన్యంతో జరిగిన క్యాంపులో సుమారు 400 మందికి టెస్టులు నిర్వహించారు. ఈ సందర్భంగా నాగభూషణం, మురళీధరుడు మాట్లాడుతూ..రోజు రోజుకు కేన్సర్ మహమ్మారి ప్రజలను పట్టి పీడిస్తోందని దీనిపై అవగాహన ఉంటే ప్రాథమిక దశలోనే నియంత్రించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, జైహింద్, రామలింగేశ్వర్ రావు, శరత్‌కుమార్, కేశవరావు దేశ్ పాండే, వెంకట్, విశ్వనాథశాస్త్రీ, జి.సుజాత, రూప, డైరెక్టర్ డాక్టర్ ఎన్.జయలత, డాక్టర్ కిషోర్, డాక్టర్ అపర్ణ, కోఆర్డినేటర్ సి.హెచ్.ప్రసాద్ పాల్గొన్నారు.

ఘనంగా మార్కండేయ జయంతి

చిక్కడపల్లి: గాంధీనగర్ డివిజన్ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో మార్కండేయ జయంతి వేడుకలు డివిజన్‌లోని ఎస్ఆర్‌టీ కాలనీలోని లలితా పరమేశ్వరి దేవాలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న నగర బీజేవైఎం మాజీ అధ్యక్షుడు ఎ.వినయకుమార్ మాట్లాడుతూ.. చిన్నారుల్లో దేవుడి పట్ల విశ్వాసాన్ని కోరికలను నెరవేర్చుకోవడంలో చూపాల్సిన పట్టుదలను పెంచేందుకు మార్కండేయుని కథను ఆదర్శంగా చెబుతారన్నారు. ఈ కార్యక్రమంలో రచ్చ శ్రీనివాస్, పున్న రాజ్‌మోహన్, బోనం ఉర్మిల, బాలరాజ్, వెంకటేష్, రఘునాథ్, పాపాయ్, కోట నిరంజన్, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ విధానాన్ని రద్దు చేయాలి



మాట్లాడుతున్న నారాయణ

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: హైదరాబాద్ మెట్రో వాటర్ సివరేజ్ బోర్డులో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఏజెన్సీ విధానాన్ని రద్దు చేసి నేరుగా బోర్డు నుంచి వేతనాలు ఇప్పించాలని హైదరాబాద్ వాటర్ వర్క్స్ సీవరేజ్ బోర్డు కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు పి.నారాయణ డిమాండ్ చేశారు. సోమవారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో హైదరాబాద్ వాటర్ వర్క్స్ సీవరేజ్ బోర్డు కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బోర్డులో పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ప్రతి నెల ఐదు లోపు వేతనాలు చెల్లించాలన్నారు. మీటర్ రీడర్స్‌కు సింగిల్ ఏజెన్సీ ద్వారా వేతనాలు ఇవ్వడంతో పాటు జీవో 60 ప్రకారం కేటగిరి–2 ప్రకారం రూ.19,500 వేతనాలివ్వాలన్నారు. కార్మికులందరికి రూ.20 లక్షల ప్రమాదబీమా కల్పించి కార్మికులు ఏదైనా కారణాలు, సహజ మరణం పొందితే వారి కుటుంబానికి రూ.10 లక్షల పరిహారం ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో రాజరత్నం, సంతోష్‌కుమార్, బి.కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

త్రికరణ శుద్ధితో సాధన చేయాలి


కార్యక్రమంలో పాల్గొన్న మఠం స్వామీజీలు

కవాడిగూడ: నిత్య జీవితంలో ఎదురయ్యే ఇబ్బందులను అధిగమించేందుకు త్రికరణ శుద్ధితో చేసే నిరంతర, లోతైన సాధన ద్వారా ఆధ్యాత్మిక వ్యవహార జీవితంలో ఉత్తమ ఫలితాలు పొందవచ్చని హైదరాబాద్ రామకృష్ణ మఠం అధ్యక్షుడు స్వామి బోధమయానంద అన్నారు. దోమలగూడ లోయర్ ట్యాంక్‌బండ్‌లోని రామకృష్ణమఠం స్వర్ణోత్సవాలలో భాగంగా సోమవారం నిర్వహించిన స్పిరిచ్యువల్ రీట్‌రీట్ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. స్వర్ణోత్సవాలలో భాగంగా సికింద్రాబాద్ మహబూబ్‌కాలేజీలో ఫిబ్రవరి 13న స్వామి వివేకానంద డే కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు.

నల్గొండ బహిరంగ సభను విజయవంతం చేయాలి


కొండా శ్రీధర్‌రెడ్డిని సన్మానించిన శ్రీధర్‌చారి

ముషీరాబాద్: కృష్ణానది జలాల్లో తెలంగాణ హక్కుల పరిరక్షణ కోసం మంగళవారం నల్లగొండలో నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ ముషీరాబాద్ డివిజన్ అధ్యక్షులు కొండా శ్రీధర్‌రెడ్డి కోరారు. సోమవారం ముషీరాబాద్ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో కార్యకర్తలతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణకు న్యాయంగా రావాల్సిన నీళ్లను రానివ్వకుండా అడ్డంకులు సృష్టిస్తున్నారని మండిపడ్డారు. సాగు నీటి హక్కులను కాపాడుకునేందుకు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేస్తున్న పోరాటానికి అండగా నిలవాలన్నారు. ఈ సందర్భంగా గౌరీశంకర్ ఆలయ కమిటీ చైర్మన్ శ్రీధర్‌చారి నూతనంగా డివిజన్ అధ్యక్షుడిగా నియమితులైన కొండా శ్రీధర్‌రెడ్డిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో అరుణ్‌కుమార్, శివముదిరాజ్, శ్రీధర్, శ్రీనివాస్, వీరేశ్, బల్వంతరాజ్ పాల్గొన్నారు.

వినతి


రోహిన్ రెడ్డికి వినతి పత్రం ఇస్తున్న చవాన్

కాచిగూడ: ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా జరపాలని, శివాజీ జయంతి రోజును సెలవు దినంగా ప్రకటించాలని చత్రపతి శివాజీ మహారాజ్ ఫౌండేషన్ చైర్మన్ సీడీ చవాన్ విజ్ఞప్తి చేశారు. సోమవారం ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.రోహిన్ రెడ్డిని బర్కత్‌పురలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సెలవు దినంగా ప్రకటించాలని వినతిలో కోరారు.

యువతి అదృశ్యం


అపర్ణ

కాచిగూడ: ఓ యువతి అదృశ్యమైన సంఘటన కాచిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ హెచ్.నరేష్ తెలిపిన వివరాల ప్రకారం... తిలక్‌నగర్ ప్రాంతానికి చెందిన సోమయ్య వాచ్‌మెన్‌గా పనిచేస్తుంటాడు. సోమయ్య కుమార్తె అపర్ణ (25) ఆదివారం ఇంట్లో నుంచి బయటకు వెళ్లి ఎంతకీ రాలేదు. బంధువులు, స్నేహితులతో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ప్రజలకు సమస్యలు తలెత్తకుండా చర్యలు


స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్: ప్రజలకు సమస్యలు తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ సూచించారు. అడిక్‌మెట్ డివిజన్ ఎస్ఆర్‌టీలో మంచినీటి, డ్రైనేజీ సమస్యలపై అధికారులతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజల సమస్యలను తెలుసుకోవడంతో పాటు వాటికి శాశ్వత పరిష్కారాలు చూపిస్తున్నామన్నారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేస్తూ ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ సకాలంలో పూర్తయ్యేలా చూడాలన్నారు. అభివృద్ధి పనుల్లో ఇబ్బందులు తలెత్తితే తన దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బస్తీ నాయకులు యాదగిరి, సురేందర్, విక్కీ, అంజయ్య, పవన్, రవియాదవ్, జగదీష్, ఆనంద్ పాల్గొన్నారు.

గ్రూప్-1 అభ్యర్థుల వయోపరిమితి పెంచడం పట్ల హర్షం

కాచిగూడ: గ్రూప్–1 అభ్యర్థులకు రెండు సంవత్సరాలు వయోపరిమితి పెంచడం పట్ల నేషనల్ ఎకనామికల్ వీకర్స్ సెక్షన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు తాడిశెట్టి పశుపతి హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత తొమ్మిదిన్నర సంవత్సరాలు పాటు కొనసాగిన బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రూప్–1 ఉద్యోగాలు భర్తీ చేయకపోవడంతో వేలాది మంది నిరుద్యోగుల వయోపరిమితి దాటి ఉద్యోగ అవకాశం కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్ల వయోపరిమితి పెంచడంతో వేలాది మంది నిరుద్యోగులకు గ్రూప్–1 పరీక్ష రాసే అవకాశం లభించిందన్నారు.

ప్రతిచోట పల్లవిస్తున్న ఘంటసాల పాటలు


మాట్లాడుతున్న సుద్దాల అశోక్‌తేజ

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలుగు పాటకు మాస్టార్ ఘంటసాలేనని ప్రముఖ సినీగేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ అన్నారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో టీపీఎస్‌కే ఆధ్వర్యంలో ‘ఆపాత మధురాలు, అభ్యుదయ గీతాలు’ అనే అంశంపై జరిగిన సమావేశంలో సుద్దాల అశోక్‌తేజ పాల్గొని మాట్లాడారు. 50 ఏళ్లుగా ఘంటసాల లేరుగాని ఆయన పాటలను గుడి, బడి ప్రతి చోట పల్లవిస్తుందన్నారు. తరాలెన్నో మారినా తెలుగు పాటకు మాత్రం ఆయనే మాస్టర్ అన్నారు. క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని రెండు సంవత్సరాలు జైలు శిక్ష అనుభవించిన వీరయోధుడు ఘంటసాల అన్నారు.ఈ కార్యక్రమంలో టీపీఎస్‌కే అధ్యక్షులు భూపతివెంకటేశ్వర్లు, కోట వెంకటేశ్వర్‌రెడ్డి, గాయని రమ, శాస్త్రీ, నర్సింగ్‌రావు, వేణుమాదవ్, ప్రణీత, అన్నపూర్ణ, రాజేష్ పాల్గొన్నారు.

అనుమతి లేని కళాశాలపై చర్యలు తీసుకోవాలి


మాట్లాడుతున్న అశోక్ రెడ్డి

కాచిగూడ: ప్రభుత్వ అనుమతి లేకుండా కొనసాగుతున్న రిసనన్స్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేసింది. నారాయణగూడలోని ఎస్ఎఫ్ఐ నగర కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు లెనిన్, కార్యదర్శి అశోక్‌రెడ్డి, స్టాలిన్, శ్రీమన్ మాట్లాడారు. ఎలాంటి అనుమతులు లేకుండా రిసనన్స్ విద్యా సంస్థలను హిమాయత్‌నగర్, ఎస్సార్‌నగర్‌లో నడిపిస్తున్నారని పది పరీక్షలు పూర్తి కాక ముందే తల్లిదండ్రులు, ఇంటర్మీడియేట్ బోర్డు అధికారులను మోసం చేస్తూ అడ్మిషన్లు తీసుకుంటున్నారని ఆరోపించారు.

ఘనంగా పాదుక పూజ


పూజలో పాల్గొన్న కార్పొరేటర్

కాచిగూడ: అనంత విభూషిత జగద్గురు రామానందచార్య స్వామి నరేంద్రచార్యజీ మహారాజ్ పాదుకా పూజ దర్శన కార్యక్రమం సోమవారం మహారాణా ప్రతాప్ హాల్‌లో ఘనంగా జరిగింది. కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్, బీజేవైఎం హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ప్రధానకార్యదర్శి యశ్వంత్ పాదుకా పూజ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో తేజరావు పాటిల్, అన్నారావు, రవి, శ్రీమంత్, మారుతి, నాగనాథ్, మల్లికార్జున్, బి.భీమ్‌రావు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాల్లో విద్యార్థులు భాగస్వాములవ్వాలి


నిర్మాణ్ ఎన్జీవో సంస్థతో ఒప్పందం చేసుకుంటున్న బద్రుకా విద్యా సంస్థల కార్యదర్శి శ్రీకిషన్ బద్రుకా

కాచిగూడ: సామాజిక సేవా కార్యక్రమాల్లో విద్యార్థులు భాగస్వాములవ్వాలని బద్రుకా విద్యా సంస్థల కార్యదర్శి శ్రీకిషన్ బద్రుకా పిలుపునిచ్చారు. కాచిగూడలోని బద్రుకా కళాశాలలో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు సోమవారం నిర్మాణ్ ఎన్జీవో సంస్థ వ్యవస్థాపక సీఈఓ మయూర్ పటియాలతో బద్రుకా విద్యా సంస్థలు ఒప్పందం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, లియో క్లబ్, స్టూడెంట్ ఛాప్టర్ విద్యార్థులు గ్రామీణ ప్రాంతాల్లో, పట్టణాల్లోని మురికివాడల్లో పేదలకు సేవా కార్యక్రమాలు అందిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. నిర్మాణ్ సంస్థ సహకారంతో సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా చేపడుతామని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బద్రుకా కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ అభిరామకృష్ణ, ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

డైరీ ఆవిష్కరణ



చిక్కడపల్లి: తెలంగాణ అసోసియేషన్ ఆఫ్ మ్యానిఫ్యాక్చర్స్ డీలర్స్, రీపేరర్స్, లీగల్ మెట్రాలజీ ఆధ్వర్యంలో రూపొందించిన డైరీని సోమవారం గాంధీనగర్‌లోని తూనికలు కొలతలు శాఖ కార్యాలయంలో లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కంట్రోలర్ కె.సిద్ధార్థ కుమార్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రబానీ, ప్రసాద్, గిరిధర్ నరేశ్, అజిత్‌గుప్తా పాల్గొన్నారు.